"మూడోట్లోగా! ఎక్కడికిపోతాడు దొంగోట్లే యించాడని కేసుపాగే స్తేసరి! తీర్పు తప్పకుండా మనపక్షమే ఔతుంది" అని సలహాయిచ్చాడు అంతరంగికుడు.

భీమయ్యకి ఈ సలహాకూడా బాగానే నచ్చింది. దావా వడేశాడుకూడా.

ఇరుపక్షాలవారు, స్వబలగసమేతంగా ప్రతి వాయిదాకి, బస్తీకి ప్రయాణంకడుతూనే ఉన్నారు. ఇంకో మూణ్ణెల్లకి తీర్పువచ్చేస్తుందన్న సంతృప్తి ఇరుపక్షాలవారూ పొందుతూనే ఉన్నారు.

"రెండున్నర సంవత్సరాలు ఎలాగూ గడిచిం దయ్యె. ఇంకో ఆరుమాసాలకి ఎలాగూ క్రొత్తెన్ని కలొస్తయిగా" అంటూ భీమయ్య పక్షంవాళ్ళ నుద్దేశించి చెంచయ్య ఎద్దేవగా అంటూ ఉంటాడని వినికిడి.

మొత్తంమీద ఒకటిమాత్రం నిజం! ఇరవై ఎకరాల కామందు భీమయ్య స్థిరాస్థిపుడు రెండకరాలు మాత్రమే! దానికితోడు నమ్మించి మోసంచేసిన బస్తీ సుందరమ్మిప్పుడు మళ్ళీ చెంచయ్య ప్రాపకం లోనే ఉంది.

---

గల్పిక

# ప్రణయానికి పొలిమేరలు

జ్యేష్ఠ

మా చిత్రం "శంఖారావం"లో ఔట్ డోర్ షూటింగ్ కని ఆ ఊరు సెలక్టుచేశాం. ఆ ఊరు ఓ చెఱువుకి ఓ వేపునఉంది. చెరువుకి మిగిలిన మూడువైపులా కొండలు, బండలు. చెఱువు దక్షిణపు గట్టున ఊరికి సమీపాన పాడుపడిన కోవెల. తరుచుగా జాతరలాంటిది జరుగుతూ ఉంటుంది. జాతర సమయాల్లో ఊరంతా కోవెల వద్దే ఉంటుంది. కల్లుబాన లదేపనిగా చేరుతాయి గుడికి చేరువగా. మగాళ్లంతా మైమరచేట్లు తప్ప తాగి తందానలాడతారు; అది జానపద నృత్యమని వాళ్లకి తెలియదు., (అదృష్టవశాత్తు ఆ రోజున తిరునాళ్ల జరుగుతున్నాయి, మేం ఆ నృత్యమే షూట్ చేశాం. కల్లుకడవలు కనపడనీయలేదు.) ఆరాత్రి మా టెంటుకి కాపలాకాయటానికో మనులతన్ని ఆ ఊరువాణ్ణే రప్పించాం. నాకు నిద్ర రావటంలేదు. అతను నిటారుగా నిలపడి టెంటు చూట్టూ చూస్తున్నాడు.

"కథ చెప్తావాదొరా!" అన్నాను. "ఊఁ," అన్నాడతను. నేను టెంటునుధూమమయం చేస్తూండగా అతను అభినయంతో ఈకథ చెప్పసాగాడు.

రెండుతరాల క్రితం ఈఊరు ఇంకా చిన్నది. ఈ గుడి అందంగాఉంది. ఈ ఊరులో ఎవరికీ సొంతభూమిలేదు. ఇదీ, మరో నాలుగైదు పల్లెలు కొండయ్యనే కొండ దొరవి, ఆదొర మహాబలశాలి. ఏడాదికో పులిని చంపుతుంటాడు. దయ, ప్రేమ అతనిలో ఇంకా కలుగలేదు. అతనికి కోపం కలిగితే ఎదుటివాడిపని సరి. అతనికి ఆనందం కలిగినా అంతే! ఆనందావేశంలో ఎదుటివాణ్ణి ఊపిరి సలపకుండాచేసి చంపుతాడు. కాని అతని కులదైవం 'చండి' పేరు వింటేచాలు—చావటానికి తయారౌతాడు దేవత పేరువిని. అతన్ని అదుపులో ఉంచగలిగింది దేవి పేరు ఒకటే, అదే అతని ప్రత్యేకత; బలహీనత.

ఆరోజున తిరునాళ్ల ఉదయాన్నే దొర ఒంటరిగా కోవెలకొచ్చాడు. ఉదయంనుంచీ ఉపవాసం, చీమనడచినా వినపడుతుంది. ఆసమయంలో అలికిడిలేదు...రవి పడమటి కడలిలో మునిగి మరి కనిపించలేదు. దొరలేచాడు దేవి ముందునుంచి.

ఆఊరికల్లా సాధువు నరుసు. అతనికూతురు యెంకి ఆ ఊరి అందాలరాణి. చిలిపి పనులలో సాటిలేనిది. అదే సమయంలో ఒంటరిగా దేవి దర్శనానికి తయారైంది. దొరచూశాడు—ఆమెపై మనసు నిలిచింది. అతని మనంలో మరులువిరిశాయి. అతనిలో లలితభావం కలగటం అదే మొదటిసారి.

దొర వెనకనుండే యెంకిని సమీపించాడు. ఆమె చెఱువుమీద చూపునిలిపింది. కదలికలేని మనోహర శిల్పసుందరిగా కనపడుతోంది. దొర ఆమె నడుంపట్టుకొని గుఱ్ఱంపై కూర్చోపెట్టాడు.

యెంకి ముఖం సిగ్గుతో కందిపోయింది. ఆమె కేక వేద్దామనుకొంటుండగానే గుఱ్ఱం గుడినుండి రెండు ఫర్లాంగులు పోయింది.

అశ్వ వేగానికి ముచ్చటపడిన యెంకికి ఆనందంతో నోట మాటరాలేదు. దొరచేతులమధ్య పొందికగా కూర్చొంది. హయం ఆయాసంతో కోటచేరింది. దొర యెంకిని ఎత్తుకొని కోటలోకి పోయాడు. దూరాన కోవెలముందు బాజాలువారి వివాహవాద్యాలయినాయి. యెంకి కొండ రాణి ఐంది. అతడామెకు బానిస.

దొరకోట మట్టికోటైనా చాలా బలమైనది. ఎత్తైనది. కోటకు వెనకవైపున గోడనితాకుతూ కొండయేరొకటి పారుతోంది. దానివేగంచూసి దాన్ని చావు ఏరని పిలుస్తారు.

ఓరోజున రాణి కోటగోడమీద జామిపళ్ళు తింటోంది. ఆమె పళ్లు చిలకలాకొరకటం, ఆమెపళ్లు తళతళ మెరవటం దొర తమాషాగా పరికిస్తున్నాడు.

ఇంతలో పళ్ళబుట్ట యేరులోకి జారింది. అది రాణి స్వయంగా చేసినది. ఎంతో అందంగా ఉండేది. రాణి బిక్కమొహం వేసింది. ఆమె "నా బుట్ట"—అనకుండానే దొరయేరులోకి ఉరికాడు దానికోసం. దొర లోతుకుపోయాడు. రాణి "తనకోసం—"కదా అని కిలకిల నవ్వింది. దొర ఉరికినచోట నీరు వలయంగా తిరుగుతోంది. అది సుడిగుండం. రాణి గుండెలు కొట్టుకున్నాయి భయంతో. ఆ తరువాత ఆమె ఎవరికీ కనపడలేదు.

"ఆమె ఏమైంది?" నేను కుతూహలంతో అడిగాను. దొర అన్నాడు. "ఆమె చనిపోయింది. ఆ తొందరలో కాలుజారి ఏరులో పడిందంటారు" నేను చూస్తున్నాను. దొర అన్నాడు, "ఆ పళ్లబుట్ట ఆమె దొర చస్తాడని ఏరులోకి జారివిడిచింది అని చెప్పుకొంటారు. ఇప్పుడామెను 'వంచకి'అంటారు." నేనడిగాను. "నిజంగా ఆమె వంచకి కాదా?"

"కాదు. ఆమె ప్రేమదేవత. దొర తమాషాగా నీటిలో 20నిమిషాలు ఉండగలడు"అన్నాడు తాత.

"అయితే అతనే ద్రోహి"అనుకొంటున్నా నేను. ఇంతలో ఆ ముసలితాత అన్నాడు, "నేనే ఆ కొండ దొరని. ఆమె ఉరకాలనిఉరికింది ఏరులోకి."

---

కథానిక

# విలయవలయం

"వల్లపురెడ్డి"

"ప్రధాని నెహ్రూ తన కే పదవీ అక్కర్లేదన్నాట్ట నిన్న. ఎట్లాగూ పదవి లేదుగదా అని దేశ అభ్యున్నతికి ఆధారమైన విషయాలపట్ల వైముఖ్యం వహించననీ, ప్రజాసేవద్వారా దేశమాతకు చేయాల్సిన కైంకర్యంలో లోపం లేశమైనా రానీయననీ అన్నాట్ట" అని తన ఈడువాడూ, పొరుగువాడూ అయిన ఎల్లయ్య ప్రక్కనే యున్న సుబ్బయ్యతో చెబుతూంటే విన్న రామిగాడి ఆశ్చర్యానికి అంతులేకపోయింది.

నెహ్రూ అంటే వాడికీ తెలుసు. స్వరాజ్యం వచ్చినపుడు గాంధీ, నెహ్రూ, పటేల్, సుభాష్ ఇత్యాది పేర్లన్నీ విన్నాడు. అందరికీ 'జై'లు కొడుతూ ఒకసారి —ఒకసారేమిటి, నూరుసార్లు— "పండిట్ నెహ్రూకీ జై"అన్నాడు. భారతదేశం, స్వరాజ్యం, కాంగ్రెసు, లాల్ ఖిల్లా లాంటి కొత్త కొత్త మాటలకు అర్థం కూడా ఆనాడే తెలుసుకున్నాడు. ఈ నాయకుల పేర్లు, దేశం, దేశమాత, —భారతమాత—రాజ్యం మొదలయిన మాటలన్నీ ఆనాడు వాడికున్న లౌకిక జ్ఞాన భాండాగారంలోగాని, భాషా పరిజ్ఞానంలోగాని లేనేలేవు. ఈ పదప్రకరాలన్నీ వాని మస్తిష్కంలో మసకమసకగా మెరిసి, అంతటితోనే ఆగిపోయి ఈనాటి వరకూ నిండుకాంతి నివ్వలేదు. వాటిని క్షుణ్ణంగా తెలిసికోవాలనే జిగీష వానికిలేకపోవటమే అందుకు ముఖ్య హేతువు.

అయినా, నెహ్రూ ఢిల్లీలో యుంటాడాయె! తెలిసినవాళ్ళు అప్పుడప్పు డనుకుంటూంటే ఈ విషయం వాని చెవిలో కొన్నిసార్లు అప్రయత్నంగా పడింది. ఢిల్లీలోయున్న నెహ్రూ అదేదో అన్నాడట, ఎల్లయ్యకు తెలిసిందట. ఇంట్లో నాలుగు